క్లుప్తంగా

పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని క్రమంతప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యం ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.సౌజన్య సూచించారు. బుధవారం మండలంలోని వలస గొత్తికోయల ఆవాసమైన రేగళ్లలో వైద్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామంలోని బాలబాలికల ఆరోగ్య, బరువు పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంపూర్ణ, సిబ్బంది భాస్కర్, ఏఎన్ఎం స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు విజయ కుమారి, చెల్లమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న శ్రీవేణు గోపాల స్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను దాతలు వితరణగా అందజేయగా.. ఆ విగ్రహాలకు వేద పండితులచే సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుండే ఆలయంలో అర్చన, అభిషేకాలతో పాటుగా ప్రత్యేక హోమం తదితర పూజా కార్యక్రమాలను వేద పండితులు కామవరపు విజయ మారుతి శర్మ, సంపత్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అనిత, అదనపు ఎస్సై రామమూర్తి అన్నారు. బుధవారం అశ్వారావుపేట ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వాలు, పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. మత్తుపదార్థాలు వినియోగం, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అశ్వారావుపేటరూరల్: మున్నూరు కాపుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆ సంఘం మండల అధ్యక్షుడు కురిశెట్టి నాగబాబు అన్నారు. బుధవారం అశ్వారావుపేటలో జరిగిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే విధంగా ప్రణాళిక రూపొందిస్తామని, ఐక్యంగా ముందుకెళ్దామని కోరారు. నూతన కమిటీ బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు బాధ్యులు పాశం రామారావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, కట్టా శ్రీను, దండాబత్తుల రమేష్, చిక్కం గోపాలకృష్ణ, పి.రామస్వామి, కొట్టి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి అప్పారావు, చిన్నంశెట్టి సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: ముసలిమడుగు గ్రామానికి చెందిన పెరుమాళ్ల ముత్తయ్య వారం రోజుల నుంచి కిడ్నీ, లివర్ ఇన్‌ఫెక్షన్‌తో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి కడు దయనీయంగా ఉండటంతో విషయం తెలిసిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ బాధితునికి ఆర్థికసాయమందించింది. బుధవారం ట్రస్ట్ అధ్యక్షుడు బత్తుల రామకొండారెడ్డి ఆధ్వర్యంలో బాధితునికి రూ.8వేల ఆర్థికసాయమందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఇంద్ల రాజేష్, కైపు రాజేందర్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, సంకా సురేష్, కైపు రమేష్‌రెడ్డి, ఆవుల నాగార్జునరెడ్డి, డి.బాలనారాయణరెడ్డి, రవి పాల్గొన్నారు.

కళాశాలను మణుగూరులోనే కొనసాగించాలి

మణుగూరురూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మణుగూరులో కొనసాగించాలని, నవోదయ పాఠశాల నిర్మాణాన్ని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోనే చేపట్టాలని బీఆఆర్ఎస్ పినపాక నియోజకవర్గ నాయకులు, మణుగూరు మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాడు రేగా కాంతారావు హయాంలో ఈ కళాశాల, పాఠశాలల భవన నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించడంతో పాటు కళాశాల నిర్మాణానికి రూ.64కోట్లను సైతం మంజూరు చేయించారన్నారు. కొంతమంది స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వీటిని వేరు ప్రాంతాలకు తరలించడం సరికాదని విమర్శించారు. అలాగే పామాయిల్ సాగు రైతుల కోసం అశ్వాపురం మండలంలో 125ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందని, పామాయిల్ ఫ్యాక్టరీపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా 'సీఎం కప్' పోటీలు

- కొన్నిచోట్ల ప్రారంభం, మరికొన్ని చోట్ల ముగింపు దశలో పోటీలు
- ప్రతిభ చూపుతున్న క్రీడాకారులు
- విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు



బూర్గంపాడు: విజేతలకు బహుమతులను అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు



అశ్వారావుపేటరూరల్: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



చర్ల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ ఈదయ్య

బూర్గంపాడు: క్రీడాకారులను ప్రోత్సహించి ముందుకు నడిపించేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తహసీల్దార్ ముజాహిద్ అన్నారు. బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పోటీల్లో ఖోఖో బాలుర విభాగంలో కృష్ణసాగర్ గ్రామపంచాయతీ ప్రథమ బహుమతి సాధించింది. నకిరిపేట గ్రామపంచాయతీ ద్వితీయ బహుమతి సాధించింది. వాలీబాల్‌లో కృష్ణసాగర్ ప్రథమ బహుమతిని సోంపల్లి ద్వితీయ బహుమతిని సాధించాయి. కబడ్డీలో బూర్గంపాడు ప్రథమ బహుమతి, అంజనాపురం ద్వితీయ బహుమతులను గెలుచుకున్నాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంఈఓ యదుసింహారాజు, ఎస్ఐ నాగబిక్షం, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాసాగర్, యనమదల వేణుగోపాల్, జనార్దన్, పూర్ణచంద్రరావు, హరికృష్ణ, రాము, కృష్ణ, తులసి రాము తదితరులు పాల్గొన్నారు.

చర్ల: దుమ్ముగూడెం మండలంలో సీఎం కప్ 2024 క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. మండలంలోని ములకపాడు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడాపోటీలను బుధవారం తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ ఈదయ్య ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ విభాగాల్లో ఈ క్రీడా పోటీలు కొనసాగాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

గుండాల: ఏజెన్సీ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో బుధవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడలు గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ క్రీడల్లో విద్యార్థులు నైపుణ్యాన్ని కలిగి ఉంటారని, వారిని గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఖోఖో, కబడ్డీ పురుషుల విభాగంలో దామరతోగు, ఖోఖో మహిళా విభాగంలో మామకన్ను, కాచనపల్లి, ఫుట్‌బాల్ గుండాల,వాలీబాల్ గుండాల, కాచనపల్లి జట్లు గెలుపొందాయి. ఆయా జట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పార్వతమ్మ, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, పీఈటీల బాలరాజు, నర్సమ్మ, బాబూరావు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను బుధవారం స్థానిక ఎస్సై టి.యయాతి రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ.. క్రీడా పోటీలు స్నేహభావంతో సాగాలని, పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. అలాగే తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని, క్రీడలతో పోటీతత్వంతోపాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. అనంతరం పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ ప్రసాద్, ఎంపీఓ సోయం ప్రసాద్, కార్యదర్శి శ్రీరామమూర్తి, పీడీ రామారావు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయ గ్రామాల్లో పోలీసులు

గుండాల: గ్రామాల్లోకి అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీసులకు సమాచారం అందించాలని టేకులపల్లి సీఐ సురేష్ అన్నారు. ఆళ్లపల్లి మండలం అనంతోగు, ముత్తాపురం పంచాయతీల్లోని గొత్తికోయ గ్రామాలను సిబ్బందితో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి అడ్డుపడే మావోలకు సహకరించొద్దని, సహకరించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమకు సమాచారం అందిస్తే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్సై రతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



గొత్తికోయ కుటుంబాలతో మాట్లాడుతున్న పోలీసులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

దమ్మపేట: ఇటీవలే నూతనంగా ఎంపికైన దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణిని, రాష్ట్ర నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రం, దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో, నాయకపోడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య, జిల్లా అధ్యక్షులు శివశంకర ప్రసాద్‌ల నాయకత్వంలో ఆ సంఘం నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి శ్రీను దంపతులను మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చైర్మన్ పదవిని నాయకపోడు సామాజిక వర్గానికి కేటాయించి, తమ సంఘానికి ప్రత్యేకమైన గుర్తింపు ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల దుర్గయ్య, నారం సీతారాం, రావుల రామకృష్ణ, రావుల శ్రీను, వాసం శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

రహదారిపై గుంతలు పూడ్చివేత



గంతలను పూడ్చిస్తున్న పోలీసులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ పోలీసులు ప్రధాన రోడ్ల పాటు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చించారు. ప్రధానంగా అంబేడ్కర్ సెంటర్‌లో భారీ గుంత ఏర్పడడంతో రాకపోకల సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు పట్టణ వాసులు సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం గుంతలను సిమెంట్ కాంక్రీట్‌తో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులు పట్టణ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి వెంట చెట్లు నరికివేత



చెట్లు నరకడంతో మిగిలిన మోడు

చంద్రుగొండ: మండంలోని రావికంపాడు నుంచి గానుగపాడు వెళ్లే రహదారి పక్కన ఉన్న చెట్లను బుధవారం కొందరు వ్యక్తులు నరికివేశారు. మూడు మహావృక్షాలను నరికి వేయడంతో పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. రహదారి వెంట అహ్లాదాన్ని పంచుతున్న వృక్షాలను నరికివేయడంపై గానుగపాడు గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా.. చెట్లు నరికిన వారి వివరాలు సేకరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు అఖిలపక్ష నాయకులతో సమావేశం

ములకలపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు విషయమై అఖిలపక్ష పార్టీల నాయకులతో నేడు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రేవతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకుల సకాలంలో హాజరు కావాలని కోరారు.

మాజీ సర్పంచ్ సీతమ్మ మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ స్వామినేని సీతమ్మ(68) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు ఓరుగంటి రమేష్, తూము వీరరాఘవులు,ఆవుల రవి, బేతం రామకృష్ణ సీతమ్మ మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ పార్టీ నాయకులు, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, నాయకులు, స్థానిక ప్రముఖులు సీతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దళితులకు ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన దళితులకు ఇవ్వాలని దళిత ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు అల్లాడి జయరాజు అన్నారు. స్థానిక ఏఎంసీ కాలనీలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో అనేక మంది అర్హులైన దళితులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం గతంలోనే దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటి వరకు అధికారులు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శాంతిరాజు, రామకృష్ణ, దిలీప్, నరేష్, వినయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: గిరిజనులు భూ సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకుడు కరపటి గోపాల్‌రావు అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. అర్హులైన ఆదివాసీలకు వారసత్వ పట్టాలు మంజూరు చేయాలని, అసైన్డ్ భూముల పట్టాలు మార్పిడి చేయాలని, క్రయ విక్రయాల భూములకు పట్టాలివ్వాలని, ఆదివాసీల సాగులో ఉన్న ప్రభుత్వ భూములను పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ జెడ్పీటీసీ, సంఘ నాయకులు సున్నం బాబూరావు, ఊకే శ్రీను, గడ్డం బాబూరావు తదితరులు ఉన్నారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల, ఎల్ఆర్ఎస్ సర్వేలను పారదర్శకంగా చేపట్టాలని డీపీఓ చంద్రమౌళి సూచించారు. బుధవారం ఆయన అశ్వారావుపేట, గుర్రాల చెరువు గ్రామ పంచాయతీల్లో చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల యాప్, ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాప్‌లో లబ్ధిదారుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ సర్వేలో అశ్వారావుపేట మేజర్ పంచాయతీ వెనుకబడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో డీఎల్‌పీఓ రమణారావు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల వివరాలు నమోదు

చంద్రుగొండ: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను బుధవారం కార్యదర్శులు నమోదు చేసుకున్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేరు, ఇంటి నమూన, స్థలం ఉందా, లేదా అనే వివరాలు అడిగి యాప్‌లో పొందుపర్చారు.



అశ్వారావుపేటరూరల్: ఇందిరమ్మ సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ, డీఎల్‌పీఓలు



చంద్రుగొండ: గానుగపాడులో దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

సమసమాజ స్థాపనకే పోరాటం

మణుగూరురూరల్: సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్ట్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య అన్నారు. మున్సిపాలిటీలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు మున్సిపాలిటీ కావడంతో ఎంతోమంది ఉపాధి పనులు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపాలిటి గ్రామాల్లో సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ నెల 26న జరిగే సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నూతన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి డి.సుధాకర్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు టి.రమేష్, జె.రాజబాబు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా చేపట్టిన పనులు, కూలీల చెల్లింపులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ ఏపీడీ నల్లబోతుల రవి హాజరయ్యారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో గతేడాది నవంబర్ 24వ తేదీ నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహించిన అభివృద్ధి పనులు, కూలీల వేతనాలు, పలు శాఖల చేపట్టిన పనులపై తనిఖీలు చేపట్టారు. కాగా, పంచాయతీల వారిగా వివరాలు వెల్లడిస్తుండగా పనుల్లో అవకతవకలు, వేతనాల చెల్లింపుల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బుధవారం రాత్రి వరకు తనిఖీలు సాగుతూనే ఉన్నాయి. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణారావు, సామాజిక తనిఖీ అంబుడ్స్ మ్యాన్ నాగప్రకాశ్, విజిలెన్స్, క్వాలిటీ విభాగం అధికారులు రామారావు, అనిల్, ఎస్ఆర్‌పీ కొమరయ్య, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏపీఓ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన



అశ్వారావుపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న జర్నలిస్టులు

అశ్వారావుపేట: జర్నలిస్టులపై సినీనటుడు మోహన్ బాబు దాడిని ఖండిస్తూ అశ్వారావుపేటలో జర్నలిస్టులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. రింగ్ సెంటర్‌లో రాస్తారోకో, ప్రదర్శన నిర్వహించారు. మోహన్‌బాబును చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికిరణ్, వలీపాషా, హరీష్, సతీష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంకు చెందిన అయ్యప్పస్వాములు 41 రోజుల పాటు దీక్షలను పూర్తి చేసి శబరిమలైకు భయలుదేరారు. లక్ష్మీనగరంకు చెందిన గురుస్వాములు జీరి సత్యనారాయణ, జి.పవన్, అల్లాడి వెంకటేశ్వర్లు, గోసుల వెంకటేశ్వర్లు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో దీక్షలు పూర్తి చేసుకొని దాసాంజనేయస్వామి వారి ఆలయంలో ఇరుముడులు కట్టుకొని అయ్యప్ప నామస్మరణ చేస్తూ శబరిమలైకు భయలుదేరారు. ఈ సందర్భంగా లక్ష్మీనగరంలో స్వాములు శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలం నలు మూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ములకలపల్లి: జగన్నాథపురం మాజీ సర్పంచ్ సోయం కృష్ణను బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరామర్శించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కృష్ణ వైద్య చికిత్సలు పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి సీతాయిగూడెంలోని కృష్ణ స్వగృహానికి వెళ్లి పమార్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్ రావు, కుంజా వెంకటేశ్వర్లు, సున్నం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విగ్రహంపై విమర్శలు తగవు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేయడం తగదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సచివాలయంలో తెలంగాణ తల్లి ఆవిష్కరించంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. తక్షణమే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు విమర్శలు మానుకోవాలని కోరారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, బూషి పాండు, అప్పలరాజు పాల్గొన్నారు.

భూతనాథుడికి అభిషేకం

మణుగూరురూరల్: మున్సిపాలిటిలోని శివలింగాపురంలోని స్వయంబు నీలకంఠేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న శివాలయం పీఠంలో ఆలయ అర్చకుడు గురుస్వామి అద్వైత్‌శర్మ, గురుస్వాములు యాకయ్య, విద్యాసాగర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం భూతనాథుడు, అయ్యప్పస్వామికి అష్టాదశ ద్రవ్యాలతో ఘనంగా అభిషేకం చేశారు. తొలుతగా స్వామి వారిక అష్టోత్తర నామాలతో పూజలు చేశారు. అనంతరం గురుస్వామి అద్వైత్‌శర్మ మాళధారుల గోత్రనామాలతో గౌరమ్మకు, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం అయ్యప్పస్వామిని గంగాజలం, పసుపు, కుంకుమ, గంధం, విభూదితో మాలధరించిన స్వాములపై చల్లి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శివాలయం పీఠం గురుస్వాములు మోర్ శ్రీను, సదానందం, నాగేశ్వరరావు, వీరన్న, బాలు, మధు, పట్టాభి, పెరు స్వామి కర్పూరం వెంకన్న, గథ స్వాములు కునుకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో హరితహారం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఆవరణాలో హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు ప్రతి ఒక్కరు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అడవులను నరకడంతో వాతావరణంలో మార్పులు కలిగి అనేక రకాలుగా దానికి ప్రభావం చూపిస్తోందని, మానవ మనుగడకు మొక్కలు పెంచడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భూపతిరావు, బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హావీలా అధ్యాపకులు హిమజ, నాగ సమీర, రాఘుమ, శ్రీను, సుధాకర్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు